క్లుప్తంగా

టెండర్ల ఆహ్వానం

సీతంపేట: గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాలకు అరటి పండ్లు, చికెన్ సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడి గురుకుల పాఠశాల, సీతంపేట, కారిగూడ మినీగురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్‌కు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు సొమ్ము ఆయా సంస్థల పేరిట డీడీల రూపంలో టెండర్ షెడ్యూల్‌కు జత పర్చాలన్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు రూ.500లు నగదు చెల్లించి టెండర్ షెడ్యూల్‌ను గురుకులం సెల్‌కు అందజేయాలన్నారు. 26న టెండర్ ఐటీడీఏలో నిర్వహించనున్నామని తెలిపారు.

కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ



ఆటపాటలతో శిక్షణ సాగిస్తున్న భాష వలంటీర్లు

సీతంపేట: ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సవర భాష వలంటీర్‌లకు వృత్యంతర శిక్షణ మూడో రోజు ఆట, పాటలతో కొనసాగింది. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యాబోధన ఎలా బోధించాలనే అంశమై డీఆర్‌పీలు వివరించారు. సవర భాషలో గేయాలు, డ్యాన్సులతో అలరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, పీఎంఆర్‌సీ స్టాఫ్ ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, ఏవైఎస్ సొసైటీ ప్రతినిధులు వెంకటరావు, ఎస్.చిన్నరాయుడు, బి.తర్మి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం అరుదైన శస్త్ర చికిత్స చేసినట్టు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుమకు చెందిన తాలవలస ఉష బొడ్డు హెర్నియాతో బాధపడుతూ ఈ నెల 16న ఆస్పత్రిలో చేరింది. వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఆమెను ఉంచి జనరల్ సర్జన్ డీవీ శ్రీనివాసరావు, మత్తు డాక్టర్ జోయల్ రత్నాకర్‌ల బృందం ఆపరేషన్ చేశారు. మెష్‌తో అనాటమికల్ రిపేర్ చేసినట్టు తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామానికి చెందిన బడిశెట్టి త్రినాధ్ అనారోగ్యంతో కొద్ది రోజుల కిందట మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులకు గురువారం గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకర్, ఎంపీటీసీ జి.విద్యారాణి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేల నగదును అందజేసారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం

భామిని: బత్తిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న వినూత్న కార్యక్రమాలు చేపట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు ఆధ్వర్యంలో అధికారులు ముఖ్యమంత్రి జగనన్న ఉపన్యాసాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలకు వివరించారు. ఎంపీడీఓ జి.చంద్రరావు, డీటీ నిమ్మల శేఖరం, ఎంఈఓ వి.భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కె.దామోదరరావు, కె.శివకుమార్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోహనబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురు దత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, కాకడహరతి తదితర పూజలు నిర్వహించాయి. బాబాకు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీజైగురుదత్త హోమాలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

● ఆకట్టుకుంటున్న అష్టాదశ శక్తిపీఠ మండపం



శక్తి పీఠాల వద్ద లలితా త్రిపుర సందరీదేవి



శక్తిపీఠాల రూపంలో అమ్మవారి విగ్రహాలు

నగరపంచాయతీలోని నక్కలపేటలో ఉన్న షిర్డీసాయి సకల దేవతాలయంలో దసరా సందర్భంగా అష్టాదశ శక్తిపీఠ మండపం ఏర్పాటు చేశారు. 18 శక్తిపీఠాలను ఒకే చోట ఉంచి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేశారు. కనుల నిండుగా అమ్మవార్లు కొలువు తీరడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం కోసం తరలి వస్తున్నారు. ఈ శక్తి పీఠాల వద్ద ప్రతి రోజు కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. – పాలకొండ



శక్తి పీఠాల వద్ద శివుని విగ్రహం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

● ఎమ్మెల్యే కళావతి



యరకారాయపురంలో ప్రభుత్వ సంక్షేమ పాలన ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తూ ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని యరకారాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు, వారి యోగక్షేమాలపై ఆరా తీసారు. గడిచిన నాలుగేళ్లగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదరు కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధి, అమలు చేస్తున్న నవరత్నాల గురించి క్షుణ్ణంగా వివరించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజారంజక పాలన సీఎం జగన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులు ఎక్కడ ఉన్నా నవరత్నాలు వారికి అందిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో చేసిన మోసాలు, అబద్దపు హామీలతో కాలం వెళ్లబుచ్చినట్లు దుయ్యబట్టారు. తమ హయాంలో అర్హతే కొలమానంగా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. గ్రామ స్థాయిలో గల సచివాలయ వ్యవస్థను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ప్రజలు విన్నవించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులకు సదరు సమస్యల పరిష్కారంపై చర్యలు చేపట్టాలని సూచించారు. జీజీఎంపీ నిధులతో మరింత అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, ఎంపీటీసీ మజ్జి నవీన్‌కుమార్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.శివప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ బి.గౌరు, వైఎస్సార్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు బూరాడ తేజ, బొత్స శ్రీను, తేజ, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేతనదారులకు శతశాతం పనులు



ఉపాధి వార్షిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అధికారులు

పాలకొండ రూరల్: వలసలు నివారించి ఉపాధి వేతనదారులకు శతశాతం పనులు కల్పించేలా ప్రత్యేక వార్షిక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు ఆ పథకం ఏపీఓ ఎం.ఈశ్వరమ్మ అన్నారు. గురువారం గ్రామ సర్పంచ్ రణస్థలం రమాదేవితో కలసి గ్రామ సభ నిర్వహించారు. రానున్న ఏడాదిలో ఏ నెలలో ఏ పని చేయాలో వేతనదారులకు అర్థమయ్యేలా ప్రణాళికా చిత్రం వేసి అవగాహన కల్పించారు. పండ్ల తోటలు, నీటి వనరుల అభివృద్ధితో పాటు గ్రామస్తులు సూచించిన అభివృద్ధి పనులు రూ.2 కోట్లు ఖర్చు అయ్యేలా అంచనాలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం, టెక్నికల్ సహాయకులు ప్రసాద్, ఉపాధి జేఈ పద్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి : డీఈఓ



ఎంఈఓలతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

కురుపాం: నాడు – నేడు పనులు త్వరిగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మండల విద్యాశాఖాధికారి ఎన్.సత్యనారాయణ, సిబ్బందిని సూచించారు. గురువారం ఆయన కురుపాం ఎమ్మార్సీలో నాడు నేడు పనుల పురోగతిపై రికార్డులను పరిశీలించారు. అనంతరం నవంబర్ 3 వరకు జరిగే స్టేట్ ఎడ్యుకేషన్ అస్సెస్మెంట్ సర్వేపై రివ్యూ చేసారు. కురుపాం మండలంలోని 21 స్కూల్స్‌లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఈ సర్వే చేపట్టే క్రమంలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంఈఓకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.శంకరరావు, సీఆర్‌పీ జి. నరేష్, ఎంఐఎస్, ఎల్‌డిఏలు పాల్గొన్నారు.

వరి, పత్తి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: మండలంలోని వరి, పత్తి పంటలను రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.ఎస్.ఎస్.కె.పాత్రో, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నిర్మల జ్యోతి, శాస్త్రవేత్తలు గురువారం పలు గ్రామాల్లో పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వరి, పత్తి పంట పువ్వు దశలో ఉండటంతో తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వరిలో 2శాతం యూరియా పిచికారీ చేయాలని, పత్తిలో 1శాతం యూరియా పిచికారీ చేయాలని, వీటితో పాటు సూక్ష్మ పోషక ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వేడుకగా శరన్నవరాత్రి పూజలు



గరుగుబిల్లి: నాగూరులో దుర్గ అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస, రావుపల్లి గ్రామాల్లోని సంతోషిమాత ఆలయం, పెద్దూరు, గరుగుబిల్లిలోని దుర్గగుడిలో, నాగూరు, బీవీ పురం తదితర గ్రామాలలో శరన్నవరాత్రి పూజలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యావచనం, మండపారాధన, అంకురార్పన, అఖండ దీపారాధన తదితర పూజలను నిర్వహించిన పిమ్మట అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేసి పూజలను నిర్వహించడం జరుగుతుందని అర్చకులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈఈ వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ, పట్టణ ఫీడర్ల పరిధిలోగల బైపాస్ కాలనీ, అజయ్‌నగర్, మారుతీనగర్, ఇందిరాకాలనీ , సౌందర్య రోడ్డు నుంచి కుమ్మరివీధి వరకు, చెరువుగట్టు, గాంధీ సత్రం, దేవీనగర్, కృష్ణపల్లి, సారిక వీధి, జగన్నాథపురం, రెడ్డివీధి, పాతరెల్లివీధి, కుసుమగుడివీధి, బెలగాం, జీఎస్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, కలెక్టరేట్ ప్రాంతంలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి బొత్స పర్యటన విజయవంతం చేయండి

పార్వతీపురం టౌన్: నియోజకవర్గంలో నవంబర్ 1న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక బస్సుయాత్రకు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సన్నాహక సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారం

పార్వతీపురంటౌన్: నియోజకవర్గంలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించి గ్రామాల్లో పర్యటించడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని చందలింగి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు పరిష్కరించడానికి ఉన్నాయా అని ప్రశ్నించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన ఊయక లక్ష్మి భర్త నరసన్న ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : డీఎస్పీ



రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: దసరా సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ పెరగడంతో సమస్యను పరిష్కరించేందుకు డీఎస్పీ కృష్ణారావు చర్యలు తీసుకున్నారు. ఒక వైపు అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో ప్రధాన రహదారి రద్దీగా మారింది. మరో వైపు పార్వతీపురం – విజయనగరం హైవే బ్రిడ్జి పాడవడంతో అటుగా వెళ్లాల్సిన భారీ వాహనాలను పాలకొండ మీదుగా మళ్లించారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. దీంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో గురువారం డీఎస్పీ రహదారులు పరిశీలించి భారీ వాహనాలను అన్నవరం రహదారి మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు. అన్ని సెంటర్లు వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఒకవైపు వాహనాలు వెళ్లిన తరువాత మరో వైపు నుంచి వాహనాలను పట్టణంలోని అనుమతించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరించాలని కోరారు. తమ సిబ్బంది అందించిన సూచనలు పాటించి ట్రాఫిక్ నిలిచిపోకుండా అవగాహన పెంచుకోవాలని కోరారు.

గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



గుమ్మలక్ష్మీపురంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల కోసం ప్రవేశపెట్టిన చట్టాలన్నీ పకడ్బందీగా అమలు జరపాలని సీపీఐ, ఏపీ గిరిజన సమాఖ్య నాయకులు కూరంగి మన్మథరావు, టి.జీవన్ అన్నారు. ఈ మేరకు గిరిజనులకు కల్పించబడిన చట్టాలను అమలు పర్చాలన్న ప్రధాన డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు గురువారం ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాల జాబితాలో చేర్చాలని, గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, గిరిజనులు సాగు చేస్తున్న, సేకరిస్తున్న పంటలకు మద్దతు ధర కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాద్, సింగన్న, మండంగి రామారావు తదితరులున్నారు.

ఉత్కంఠగా కబడ్డీ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మన్మధరావు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సీనియర్ కబడ్డీ క్రీడాకారుల నేతృత్వంలో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ గురువారం జరిగింది. డీఎస్పీ జీవీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్మధరావు, పల్లా కిందలరావు, ఎస్ఐ బి. శివప్రసాద్ నేతృత్వంలో ఈ క్రీడలు ప్రారంభమయ్యాయి. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభ కనబరిచారు. క్రీడా ప్రియులు కబడ్డీని ఆసక్తిగా తిలకించారు.

● ప్రజారోగ్యమే మహాభాగ్యం



పాలకొండ రూరల్: చినమంగళాపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి తదితరులు



జియ్యమ్మవలస: రోగులకు ఆరోగ్యానికి సంబంధించిన రిఫరెన్స్ పుస్తకం అందజేస్తున్న జెడ్పీటీసీ శశికళ



వీరఘట్టం: వండవలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించిన ఎమ్మెల్యే కళావతి

ప్రజారోగ్యమే మహాభాగ్యంగా రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది మందులు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

● లలితాదేవి అలంకరణలో కోటదుర్గమ్మ



కురుపాం: లలితాదేవి అలంకరణలో కోటదుర్గమ్మ



భామిని: దిమ్మిడిజోలలో విజయదుర్గ అలంకరణలో దేవికి పూజలు



పాలకొండ: లలితాదేవి అలంకరణలో కోటదుర్గమ్మ

కురుపాం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రావాడ రోడ్డు కోటి జంక్షన్‌లో వెలసిన కోటదుర్గమ్మ వారు గురువారం లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొన్న వారికి కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు.

పాలకొండలో...

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ వారు దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. శరన్నవరాత్రిలో వచ్చిన గురువారం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఘటాలతో మొక్కులు తీర్చుకున్నారు.

విజయదుర్గ అమ్మవారుగా...

భామిని: దసరా నవరాత్రుల్లో భాగంగా గురువారం దుర్గామాతను విజయదుర్గ అలంకరణతో పూజలు చేశారు. బాలేరులో మహిళలు సుందరంగా అలంకరించుకొని రాధాకృష్ణుని గీతాలతో కోలాటం ఆడారు. దేవి విగ్రహం వద్ద పూజలు చేశారు.